# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో అర్హులైన లబ్దిదారులకు మేలు జరిగేలా ఇళ్ల పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.**
2. **బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరేలా 'నేను బడికి పోతా' పేరుతో ప్రత్యేక కార్యకమాన్ని ప్రారంభించినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం తెలిపింది.**
3. **తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి కుమార స్వామి ఈ రోజు దర్శించుకున్నారు.**
4. **రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.**
5. **టి20 ప్రపంచ కప్ క్రికెట్లో భాగంగా ఈరోజు జరిగే చివరి గ్రూప్ మ్యాచ్ లో భారత జట్టు, కెనడా జట్టుతో పోటీ పడనుంది.**

==========================

కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 45 మంది భారతీయుల మృతదేహాలను భారత వైమానిక దళం ప్రత్యేక విమానంలో భారత్ కు తీసుకువచ్చింది. అగ్నిప్రమాదం జరిగిన సంఘటనా స్థలంలో ఉన్న 176 మంది భారతీయ కార్మికులలో, 45 మంది మరణించగా, 33 మంది గాయాలయ్యాయని, మిగిలిన వారు సురక్షితంగా ఉన్నారని విదేశాంగ శాఖ అధికారులు తెలిపారు.

కాగా మరోవైపు కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారిలో రాష్ట్రానికి చెందిన వారు ముగ్గురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో వారి మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు 5 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు.

---------------------------

రాష్ట్రంలో నిరుపేదలైన లబ్దిదారులకు మేలు జరిగేలా ఇళ్ల పథ కాన్ని అమలు చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. మంత్రిగా నియమితులైన ఆయన నిన్న వెలగపూడి సచివాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. గృహ నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనపై ఎప్పటి కప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తామన్నారు. త్వరలోనే శాఖాపరమైన సమీక్ష నిర్వహించి

తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

---------------------------

బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించేందుకు సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం 'నేను బడికి పోతా' పేరుతో ప్రత్యేక కార్యకమాన్ని ప్రారంభించినట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ కార్యక్రమం జూలై 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ కార్యక్రమంలో భాగంగా చదువుకోవడం వల్ల కలిగే లాభాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై పిల్లలతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోకున్నారు. ఈ మేరకు నేను బడికి పోతా కార్యకమాన్ని గ్రామ, పట్టణ వార్డు స్థాయిలో నూరు శాతం అమలు చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు నిన్న మార్గదర్శకాలు జారీ చేశారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుతం యువతకు ఉన్న నైపుణ్యం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించడానికి నైపుణ్య గణన 2024 చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదో సంతకంగా చేసిన నైపుణ్య గణనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థని నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15 నుంచి 29 ఏళ్లలోపు ఉన్న యువతలో నైపుణ్యాలను గుర్తించడమే కాకుండా వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణ అవసరమవుతుందన్న అంశాలపై గణన చేపట్టనట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి కుమార స్వామి దర్శించుకున్నారు. ఈ రోజు వేకువజామున సుప్రభాత సేవలో కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా...ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో కేంద్రమంత్రిని సత్కరించారు.

---------------------------

బ్రిటీషు కాలం నాటి చట్టాల స్థానంలో, కేంద్రప్రభుత్వం నూతన చట్టాలను తీసుకురావడం అభినందనీయమని చిత్తూరుకు చెందిన కేంద్రప్రభుత్వ మాజీ న్యాయవాది మధుబాబు హర్షం వ్యక్తం చేశారు. నేరాలకు సంబంధించి గత చట్టాల వల్ల విచారణలోను, న్యాయంలోను ప్రజలకు తీవ్ర జాప్యం జరిగేదని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మూడు నూతన నేర న్యాయ చట్టాలను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్టాలు ప్రజలతో పాటు ప్రభుత్వ యంత్రాంగానికి కూడా ఎంతో మేలు చేస్తాయని ఆకాశవాణికి తెలుపుతూ,

వాయిస్ ... 32 సెకన్లు

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా 1997బ్యాచ్ సీనియర్ ఐఎఎస్ అధికారి జె. శ్యామలరావు నియమితులయ్యారు. ప్రస్తుతం టిటిడి ఈవోగా ఉన్న ధర్మారెడ్డిని బదిలీ చేస్తూ ఆ స్థానంలో శ్యామలరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్యామలరావు

ప్రస్తుతం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కరవు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఈనెల 19, 20 తేదీల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ తెలిపారు. కేంద్ర పశు సంవర్థక, డెయిరీ శాఖ డైరెక్టర్ సందీప్‌శర్మ ఆధ్వర్యంలో మన్ను జి. ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యలతో కూడిన కేంద్ర బృందం జిల్లాలో కరవు పరిస్థితిని పరిశీలించి నివేదిక రూపొందిస్తుందని ఆయన వెల్లడించారు. కేంద్ర బృందం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని, కరవు నష్టాన్ని వివరించేలా ఛాయాచిత్రాల ప్రదర్శన, బృందం పరిశీలించే ప్రాంతాలకు సంబంధించిన మార్గ సూచిలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో పర్యాటక, సినిమా రంగాల అభివృద్ధి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిన్న రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చేరుకున్న మంత్రిని జిల్లా  కలెక్టర్ మాధవీలత ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి సంబందించిన అన్ని వనరులు ఉన్నాయని వాటికి ప్రచారం కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు.

---------------------------

యోగా సంపూర్ణ వికాసానికి దోహదపడుతుందని ప్రకాశం జిల్లా  కారాగారం సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి అన్నారు. ఈ నెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని జిల్లా కారాగారంలోని ఖైదీలకు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వరుణారెడ్డి మాట్లాడుతూ, ప్రపంచానికి భారతదేశం అందించిన ఒక వరం యోగా అని అన్నారు. జైలులో ప్రతిరోజూ యోగా సాధన చేయించడం జరుగుతుందన్నారు.  ఖైదీలలో మానసిక పరివర్తనకు, వారి ఆరోగ్యానికి యోగా ఉపయోగపడుతుందని తెలుపుతూ,

వాయిస్ (32 సెకన్లు)

---------------------------

రాయలసీమ నుంచి మధ్య బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల్లో  తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

---------------------------

ఐసీసీ  పురుషుల టి20 క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా ఈరోజు  ఫ్లోరిడాలో జరిగే చివరి గ్రూప్ స్టేజ్ మ్యాచ్ లో భారత జట్టు,  కెనడా జట్టుతో పోటీ పడనుంది. భారత కాలం  ప్రకారం ఈ మ్యాచ్ ఈ రోజు రాత్రి 8 గంటలకు జరుగుతుంది.  నిన్న ఐర్లాండ్  అమెరికా మధ్య జరగవలసిన క్రికెట్ మ్యాచ్  వర్షం కారణంగా  రద్దు

కావడంతో అమెరికా జట్టు సూపర్ 8 దశకు చేరింది. గ్రూప్ ఏ నుండి ఇండియా జట్టు తర్వాత సూపర్ 8 దశకు చేరిన  రెండవ జట్టుగా అమెరికా నిలిచింది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత స్పష్టం చేశారు. నిన్న ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వంలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ విషయంలో మహిళా సంఘాల సూచనలు కూడా తీసుకుంటామని చెప్పారు. పోలీసులు ప్రజల కోసం.. చట్టప్రకారం పనిచేయాలని సూచించారు. వేతనాలు, బకాయిల విషయంలో పోలీసుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని అన్నారు.

======================